
# సైకిల్ బెల్



కథ

ఎం. వెంకటేశ్వరరావు

రాత్రంతా వర్షం తుంపరగా పడుతూనే ఉంది. ఉదయం ఐదు గంటలకే నిద్ర లేచి, బద్ధకంగా వళ్ళు విరుచుకుంటూ పక్కకి తిరిగి చూశాడు రాములు. తన మంచం పక్కన చాప మీద భార్య మంగమ్మ, కొడుకుని, కూతుర్ని చెరోపక్కన పడుకోబెట్టుకుని గాఢంగా నిద్రబోతోంది. దిండు పక్కనున్న బీడీ కట్టలోనుంచి ఒకటి తీసి ముట్టించి, రెండు దమ్ములు గట్టిగా పీల్చి, వాకిలి తలుపు తెరిచి, రాత్రి ఇంట్లో ఇరికించి పెట్టిన మూడు సైకిళ్ళూ బయట పెట్టి, తలుపు దగ్గరగా వేసి బీడీ కాలుస్తూ, కాలకృత్యం తీర్చుకునేందుకు చెంబు పట్టుకుని ఊరి చివరకెళ్ళి, తిరగొచ్చి, గూట్లో ఉన్న వేప పుల్లతో దంతవధావనం కానిచ్చుకుని లోపలికొచ్చి చూశాడు. భార్యనిద్రబోతూనే ఉంది. కొడుకు సురేషు లేచి పుస్తకాల సంచీ ముందేసుకుని చదువుతున్నాడు.



''మంగా! మంగా! లే తెల్లారింది... లే'' భార్యని పిల్చాడు రాములు. భర్త పిలుపు విని, ఆవులిస్తూ లేచి కూచుని కళ్లు నులుముకుంటూ, పెద్దగా చదువుతున్న కొడుకుని చూసి

''ఇయ్యాళ స్కూలు లేదు గదరా! కూసేపు పండుకోగూడదూ?'' అంది.

''నిద్ర బట్టట్లేదమ్మా!'' అని మళ్ళీ పుస్తకంలో తలదూర్చాడు ఏడో తరగతి చదువుతున్న సురేషు.

''పాలు పోయించుకు రారాదంట్రా!'' అన్నాడు రాములు కొడుకుతో'' వాన బడ్తాంది గదయ్యా! నువ్వే ఎళ్ళిరా! ఈ సినుకుల్లో ఆడేం బోతాడూ.. ఆణ్ణి సదువు కోనీ'' అంది మంగ అందుకుని.

''సర్లే బోయొస్త'' అని భార్య ఇచ్చిన చిన్న టిఫిన్ తీసుకుని బయల్దేరాడు రాములు.

★★★

రాములు ఆ పల్లెటూళ్ళో ఇరవై ఏళ్ళుగా సైకిల్ షాపు నడుపుతున్నాడు. రెక్కాడితేగాని డొక్కాడని జీవితం. ఇద్దరు పిల్లలు. నిజాయితీగా సంపాదిస్తున్న దానితో, ఒక స్థలం కొనుక్కుని, అందులో ఓ పూరిల్లు కట్టుకుని కాలంనెట్టుకొస్తున్నాడు. సొంతంగా పది సైకిళ్ళు అద్దెకి తిప్పుతూ, సైకిల్ రిపేర్లు, ఓవరాయిలింగులు చెయ్యటం అతనికి తెల్సిన పని. ఆ ఊళ్ళో, చుట్టుపక్కల గ్రామాల్లో రాములు సైకిల్ రిపేరు చేశాడంటే రైల్లా పరుగెడుతుందని గానీ, కక్కుర్తి పన్లు చేసి మోసం చెయ్యడని రాములు తెల్సిన వాళ్ళందరికీ తెలుసు. మంగమ్మ చిన్న చిన్న కూలిపన్లు చేస్తూ, చన్నీళ్ళకి వేణ్ణీళ్ళలా కుటుంబం కోసం తనవంతు కష్టం చేస్తుంటుంది. తమలా తమ పిల్లలు ఇబ్బందులు పడకూడదని పిల్లలిద్దర్నీ ఊళ్లో ఉన్న ఇంగ్లీష్ కాన్వెంట్లో చదివిస్తున్నారు.

★★★

రాములు బజారు చివరికొచ్చి అంజమ్మ ఇంట్లో పాలు పోయించుకుని తిరిగి వస్తుంటే...

''రాములూ! వానలో తడిసొస్తున్నావేంటి? గొడుగు తెచ్చుకోలా!'' పలకరించాడు గొడుగేసుకుని ఎదురొచ్చిన డాబా రంగయ్య.

''సన్నటి జల్లేగా! తడిస్తే మొక్కమొలుస్తానా? ఏంటి? అదిసర్లేగానీ, పోయిన్నెల నీ కొడుకు సైకిల్ ఓవరాయిలింగు చేయించుకున్న తాలుకు డబ్బులింకా ఇయ్యనే లేదు. కాస్త చూసియ్యరాదూ కటకటలాడతాంది''

''వోర్నీ బలే వోడివే ఇంత పొద్దుగాల డబ్బు లేడ్నుంచి ఊడిపడ్తయి.. ఎగ్గొట్టి ఊరొదిలి పోర్లే'' అంటూ వెళ్ళిపోతున్న రంగయ్యని చూస్తూ.

''థూ! అడగటమే తప్పన్నట్టు మాటాడతాన్నవే పొద్దునడిగితే, సాయంత్రమంటవు, సాయంత్రమడిగితే పొద్దుగాల్నంటవు పైసలున్నోడికే ఈ పీనాసితనం'' అనుకుంటూ గబగబా ఇల్లు చేరాడు.

''మంగా! ఇయిగో పాలు తొందరగా టీ ఇస్తే... నే బోతా'' అన్నాడు.

రాములు ఇంటి ముందున్న వసారాలో కూచుని, బీడీ వెలిగించి, సైకిళ్లు తుడవటం మొదలెట్టాడు.

వేప్పుల్లతో పళ్ళు తోముకుంటూ, పాతగుడ్డ తీసుకుని తనూ సైకిళ్ళు తుడవటానికొచ్చి, తుడుస్తున్న సురేషు...

''నాయనా! ఎక్స్కర్షన్‌కి డబ్బులు గట్టటానికి రేపే లాస్టంట. ఈసారయినా ఇయ్యి నాయనా! మా క్లాస్ పిల్లల్లో నేనూ నాగార్జునసాగర్ బోయొస్త'' అన్నాడు పోయిన సంవత్సరం తనని అందరి పిల్లలతో బాటు పంపని సంగతి గుర్తుజేస్తూ

''ఎంత గట్టాల్నంట?''

''మూడొందలే''

సైకిల్ వెనక చక్రాన్ని స్పీడుగా తిప్పుతూ తుడుస్తున్న రాములు ఆ మాట వినగానే...సడన్‌గా బ్రేకేశాడు.

జేబులో ముప్ఫయి రూపాయలు గూడా లేవు. మూడొందలు ఎక్కణ్ణుంచి తేవాలి ఆలోచిస్తూ, ఆరిపోయిన బీడీని నోట్లో నుంచి తుపుక్కున ఉమ్మేసి.

''చూసాలేగానీ నువ్వుబోయి సదూకో'' అని ఆయిల్ కేన్ తీసుకుని సైకిల్ బ్రేకులకి ఆయిలేస్తుంటే, భార్య వేడి టీ గ్లాస్ ఇస్తూ

''ఏంటయ్యా! సూస్తానంటన్నావు?'' అంది తనూ టీ తాగుతూ.

''ఆఁ అద్దంలో నా మొకం'' అన్నాడు విసుగ్గా.

''షాపులో కూసుని తీరుబడిగా చూసుకోగానీ, ఇంట్లో ఎచ్చాల్లేవు డబ్బులిచ్చిపో'' అందామె రాములు తాగిన టీ గ్లాసు తీసుకుంటూ.

''ఇంద'' అని ఇరవై రూపాయిలు భార్య చేతిలో పెట్టి, రెండు సైకిళ్ళు తీసుకుని షాపుకి వెళ్తుంటే, వెనకాలే కొడుకు మూడో సైకిల్ తీసుకుని తండ్రిని అనుసరించాడు.

★★★

ఆ ఊరి సెంటర్లో ఉన్న గోపయ్య కాఫీ హోటల్ పక్కన రాములు సైకిల్ షాపుంది. ఇటుకల గోడల మీద రేకులు లేసిన చిన్న షాపు. తాళాలు తీసి, లోపలున్న సైకిళ్ళు, సామాన్లు బయట పెట్టి, లోపల గోడకి తగిలించి ఉన్న దేవుని పటానికి అగరుబత్తీ వెలిగించి, రొటీన్ దణ్ణం ఒకటి పెట్టి, కొడుకుతో

''నువ్వింక ఇంటికి పో!'' అన్నాడు.

''నాయనా! రేపే నాయనా స్కూల్లో మూడొందలు గట్టల మర్సిపోమాకా''

''ఎన్ని సార్లు గుర్తుజేస్తవురా! నాకేం సెవుడు లేదు'' అని కొడుకుని కసురుకునేసరికి సురేష్ ఇంటికి పరుగెత్తాడు.



జేబులో ముప్ఫయి రూపాయలు గూడా లేవు. మూడొందలు ఎక్కణ్ణుంచి తేవాలి ఆలోచిస్తూ, ఆరిపోయిన బీడీని నోట్లో నుంచి తుపుక్కున ఉమ్మేసి. ''చూసాలేగానీ నువ్వు బోయి సదూకో'' అని ఆయిల్ కేన్ తీసుకుని సైకిల్ బ్రేకులకి ఆయిలేస్తుంటే, భార్య వేడి టీ గ్లాస్ ఇస్తూ... ''ఏంటయ్యా! సూస్తానంటన్నావు?'' అంది తనూ టీ తాగుతూ.

రాములు వీల్ బెండ్ తీసే పరికరం ముందెట్టుకుని, కొత్త చక్రానికి స్పోక్స్ బిగిస్తూ, కొడుక్కి కట్టాల్సిన మూడొందలు గురించే ఆలోచిస్తున్నాడు.

''రాములూ! రెండు సైకిళ్ళు గావాల'' కూరల కొట్టు నర్సింహం గొంతు విని

''యాడికి బోవాల?''

''ఇంకేడికి ఇసన్నపేట బోయి కూరల్దేవాల''

''మూడు ఆరు తీస్కబో'' అని పుస్తకంలో పేరు, టైము రాసుకున్నాడు రాములు.

వర్షం సన్నగా పడ్తూనే ఉంది.

రాములు లేచి సింగిల్ టీ తాగొచ్చి, బీడీ ముట్టించి మళ్ళీ చక్రానికి స్పోక్స్ బిగించటానికి కూచున్నాడు. అతని ధ్యాసంతా కొడుక్కి కట్టా

ల్సిన మూడొందలు మీదే స్వారీ చేస్తున్నాయి.

సరిగ్గా ఆ సమయంలో రాములు షాపు ముందు ఓ ఖరీదైన కారొచ్చి ఆగింది. టిప్‌టాప్‌గా డ్రెస్ చేసుకున్న, ఓ ముప్ఫయ్యేళ్ళ యువకుడు కార్లోంచి దిగాడు. వర్షపు చినుకులకి చెయ్యడ్డు పెట్టుకుని, వేగంగా రాములు పన్జేస్తున్న పందిరి కిందికొచ్చి, కర్చీఫ్‌తో చేతుల మీద పడ్డ వర్షపు బిందువుల్ని తుడుచుకుంటూ,

''రాములు అంటే మీరేనా?''

చేతిలో కాల్తున్న బీడీని పక్కన పడేసి, ఆశ్చర్యంగా చూస్తూ లేచి నిలబడి, తన పేరుని ఇంత మర్యాదగా పిలుస్తున్న ఆ వ్యక్తితో

''సార్! మీ...రు?''

''మాది పక్క ఊరు'' అని, రాములు ఆశ్చర్యాన్నుంచి తేరుకోకముందే, చినుకులో కారు దగ్గరకెళ్ళి డిక్కీలో ఉన్న పిల్లలు తొక్కే పాతకాలపు మూడు చక్రాల సైకిలు తీసుకొచ్చి,

''ఇది నా చిన్న తనంలో నేను తొక్కిన సైకిల్ ఇన్నేళ్ళూ పైన పడేశాం. మొన్న సెలవులకి ఇంటికొచ్చాం. నా మూడేళ్ళ కొడుకు దీన్ని చూసి, తొక్కుతానని గొడవ చేస్తుంటే, తీసి, తుడిచి కొంచెం ఆయిల్ వేశాక...సైకిల్ నడుస్తోంది, కానీ'' అని కవర్లో ఉన్న ఓ పాతకాలపు బెల్ తీసి రాములుకి చూపుతూ...

''ఈ బెల్ ఈ సైకిల్‌కి ఉండేది. ఇప్పుడిది పన్జేయటం లేదు. తుప్పు పట్టింది. దీని లీవర్ కూడా విరిగిపోయింది. మా ఊళ్ళో ఎవరైనా రిపేర్ చేస్తారేమోనని ప్రయత్నించాను ఎవరివల్లాకా లేదు. ఇలాంటిదే కొత్తది కొందామంటే దొరకలేదు. ఓ సైకిల్ షాపులో మీ పేరు చెప్పారు. మీరు చాలా కాలం నుండి సైకిల్ షాపు నడుపుతున్నారని, ఈ బెల్‌ని మ్రోగించటం మీ వల్లనే అవుతుందని చెప్పాడు. నా కొడుకు ఈ సైకిల్ మీద ఎక్కి తొక్కుతూ... బెల్ మ్రోగించమంటాడు.

''పాడయిందిరా!'' అంటే ఏడుస్తాడు. ఇలాంటి బెల్లే కావాలని మంకు పట్టుపడ్తున్నాడు. కాబట్టి ఎలాగైనా దీన్ని...'' అని రాములు చేతికిచ్చాడు.

రాములు షాపులో కెళ్ళి, మురికిగా ఉన్న ఓ కొయ్య స్టూలుతెచ్చి, గుడ్డతో తుడిచి, దానిమీద పాత న్యూస్ పేపరేసి,

''కూచోండి'' అన్నాడు.

రాములు బెల్ అటు, ఇటు తిప్పి చూశాడు. ఆ కాలంలో దీన్ని డబుల్ స్ట్రింగ్ బెల్ అనేవాళ్ళు. లీవర్ నొక్కగానే రెండువైపులా తిరుగుతూ ''ట్రింగ్... ట్రింగ్'' మని శబ్దం చేసేది. రాములు దాన్ని ఊడదీసే ప్రయత్నం చేశాడు. తుప్పు పట్టటం వల్ల వీలుపడలేదు.

''సార్! ఇదిక పన్జేయ్యదు. ఇలాంటి బెల్లులు ఇప్పుడు రావటం లేదు. నా దగ్గర ఇలాంటిదే ఉందేమో చూస్తాను'' అని రాములు లోపలికెళ్ళబోతుంటే...

''పాతదైనా ఫర్వాలేదు. పనిచేస్తే చాలు. నేను తీసుకుంటాను'' అని అతను అనేసరికి..

లక్షలు ఖరీదు చేసే కార్లో వచ్చిన వ్యక్తి ఆ మాట అనటంతో అతని అవసరం రాములుకి అర్థమయింది. లోపలికెళ్ళి పాత సామాన్ల మధ్య పడున్న ఓ చిన్న అట్ట పెట్టె వెతికి బయటికి తీసేసరికి పది నిమిషాలు పట్టింది. పై పెట్టెంతా మాసిపోయి దుమ్ము కొట్టుకునుంది. చేతిలో పాతగుడ్డతో దాన్ని దులిపి, దాని ధర చూశాడు. పదిహేను రూపాయలనుంది.

రాములుకి ఒక్క క్షణం అతను అన్న మాటలు మళ్ళీ చెవుల్లో మార్మోగాయి. ఎంతిచ్చైనా కొనేలా కన్పిస్తున్నాడన్పించింది. అంతే అతని ఆలోచనలు క్షణంలో తారుమారై, కొడుక్కి కట్టాల్సిన మూడొందల సంగతి గుర్తొచ్చింది. రోజంతా రెక్కలు ముక్కల్జేసుకున్నా వంద రూపాయలు మిగలటం అతి కష్టం. ఆపై మనసుని ఎక్కువ ఆలోచనల పాల్జేయకుండా, మనస్సాక్షిని కాస్త పక్కకి తప్పించేసరికి, ఫ్లాష్‌లా ఆలోచన రాములు మైండ్‌లో మెదిలింది. అట్టపెట్టె మీదున్న పదిహేను రూపాయల్లో, ఐదు ముందున్న ఒకటిని చేతిలో ఉన్న మసిగుడ్డతో గట్టిగా తుడిచి, కనబడకుండా చేశాడు. ఇప్పుడు ఆ బెల్ ధర ఏభై ఐదుగానూ, నూట ఇరవై ఐదుగానూ... చెప్పొచ్చు. వెతికి, వెతికి అలిసిపోయినట్టు మొహం పెట్టి, రాములు బయటికొచ్చాడు. అతని చేతిలో అట్టపెట్టె, దానిమీద బెల్ బొమ్మనీ చూసేసరికి ఆ వ్యకి మొహంలో మెరుపు మెరిసింది. దాన్ని గమనించిన రాములు...

''సార్! ఇదే గదా! మీరడిగే బెల్లు'' అన్నాడు.

''ఆఁ... ఇదే... ఇదే'' అని దాన్ని తీసుకుని, లీవర్ కిందికి నొక్కాడు. ''ట్రింగ్... ట్రింగ్'' మని బెల్ చేసిన శబ్దం విని అతను పొందుతున్న సంతోషాన్ని చూసిన రాములు.

''సార్! దీని రేటు కొంచెం ఎక్కువే'' అని చేతిలో ఉన్న అట్ట పెట్టె మీద రేటు చూస్తున్నట్టు అటు, ఇటూ తిప్పి చూస్తూ, మధ్యలో ఓ సారి అతని మొహం వైపు చూశాడు. అతని దృష్టంతా చేతిలో ఉన్న బెల్ మీదే ఉండటంతో..

''దీని రేటు నూట ఇరవై ఐదు సార్'' అన్జెప్పాడు తల గోక్కుంటూ.


మారు మాట్లాడకుండా మనీ పర్సు తీసి, వంద రూపాయల నోటు ఇరవైరూపాయల నోటు, ఐదు రూపాయల నాణెం తీసి... నూట ఇరవై ఐదు అతనివ్వబోతుంటే బేరమాడతాడని ఆశించిన రాములు తీసుకోవడానికి కాస్త తటపటాయించాడు. అంతలో సర్ధుకుని లోజంకుని పైక్కన్పించనీకుండా డబ్బు తీసుకున్నాడు.

''దీన్ని చూసి నా కొడుకు తెగసంబరపడిపోవటం ఖాయం. పైగా దీని లీవర్ చూడండి గుండ్రంగా చిన్న పిల్లలు నొక్కటానికి ఎంత సుళువుగా ఉంటుందో'' అన్నాడతను మళ్ళీ బెల్ నొక్కుతూ.

ఎలాగూ ఎక్కువ డబ్బులు తీసుకున్నాను గాబట్టి కొంచెం ఆయిలేసి 'షో' చేద్దామనుకుని.

''ఇటియ్యండి సార్!! క్లీన్ చేసిస్తాను'' అని బెల్ తీసుకుని ఊడదీసి, లోపలున్న రెండు స్ప్రింగులకి ఆయిల్ వేసి, మళ్ళీ బిగించి లీవర్ నొక్కాడు. ఇప్పుడు బెల్ ఇంకా స్మూత్‌గా ట్రింగ్, ట్రింగ్ మంటుంటే అతను సంబరపడిపోతూ..

''బావుంది... ఓకే... ఓ.కే'' అనంటుంటే... బెల్ మరోమారు తుడిచి, అతను తీసుకొచ్చిన మూడు




''సార్! దీని రేటు కొంచెం ఎక్కువే'' అని చేతిలో ఉన్న అట్ట పెట్టె మీద రేటు చూస్తున్నట్టు అటు, ఇటూ తిప్పి చూస్తూ, మధ్యలో ఓసారి అతని మొహం వైపు చూశాడు. అతని దృష్టంతా చేతిలో ఉన్న బెల్ మీదే ఉండటంతో.. ''దీని రేటు నూట ఇరవై ఐదు సార్'' అన్జెప్పాడు తల గోక్కుంటూ.

### యువరాజ్‌తో...

## ఎంగేజ్‌మెంటా? అబద్ధం!

'ఓం శాంతి ఓం' ఫేం దీపికా పడుకొనె, ముందు ధోనీతో చెట్టపట్టాలేసుకుని తిరిగి,తర్వాత ఎందుకు కాదనుకుందో అతన్ని కాదనుకుని, ఇప్పుడు అతని టీమ్ మేట్ యువరాజ్‌తో పెళ్ళికి సిద్ధమయింది. పెళ్ళికి ముందు జరగాల్సిన ఎంగేజ్‌మెంట్ కూడా జరిగిపోయిందని బాలీవుడ్‌లో అంతా అంటోంటే 'అబ్బే! అదేం లేదు!' అంటూ తల పట్టుకుంది పడుకొనె. మీరు లేదంటే అయిపోతుందా? అంతా గోలగోలగా చెప్పుకుంటున్నారంటే 'వద్దు! వినడానికే చాలా ఆశ్చర్యంగా ఉందిది' అంటూ మొహాన్ని మాడ్చుకుంది. టిస్సాట్ స్విస్ వాచ్‌కి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న దీపిక, ఆ హడావుడిలో, ఆ ఆనందంలో ఉంటుండగా ఈ పుకారు రాజ్యం చెయ్యడం ఆమెకి చాలా బాధను కలిగించింది.



చక్రాల సైకిల్‌కి బిగించి, దానికీ ఆయిలేసి తుడిచి ఇచ్చాక గానీ.... రాములు మనసుకి నెమ్మది అన్పించింది. పదిహేను రూపాయలకి నూటపది రూపాయల లాభం మరి.

★★★

మరుసటిరోజు ఉదయం షాపు తెరుస్తుండగా మళ్ళీ అదే కారు వచ్చి ఆగింది. నిన్న వచ్చిన వ్యక్తే మళ్ళీ కార్లోంచి దిగాడు. అతని చేతిలో చిన్న పార్శిలుంది. రాములు దగ్గరకొచ్చి...

''నిన్న ఒక బెల్లు కొన్నాను గుర్తుందా?'' అనేసరికి ఖంగుతిన్న రాములు

''ఆహా! నేను రేటు ఎక్కువ చెప్పి మోసం చేసినట్టు కనుకున్నాడు గాబోల'' అనుకున్నాడు మనసులో భయంతో.

కానీ అతని మాటల ధోరణిని బట్టి, తానూహించినట్టు కన్పించక పోవటంతో... భయం కొంచెం ఊపిరి పీల్చుకుంది.

''నిన్న ఇంటికెళ్ళగానే నా కొడుకు ఆ సైకిలు, బెల్లు చూసి ఎగిరి గంతేసి... ఎక్కిన సైకిలు దిగకుండా రాత్రి నిద్రపోయే వరకూ ఇల్లంతా తిరుగుతూ, బెల్ మ్రోగిస్తూనే ఉన్నాడు. నిన్న వాడి బర్త్‌డే. కొత్త బట్టలు, కేకులు, చాక్లెట్లు, బొమ్మలు ఎన్ని కొనిచ్చినా... వాడి మొహంలో కన్పించని సంతోషం నిన్న చూశాను. ఓ రకంగా వాడంత సంతోషంగా ఉండటానికి కారణం మీరే. అందుకే మళ్ళీ కలిసి థ్యాంక్స్ చెప్పి, కేకు ఇచ్చెళ్దామని వచ్చాను'' అని చేతిలో పార్శిలు రాములు చేతిలో పెట్టి ''మీ పిల్లలకివ్వండి'' అన్నాడు.

అంతే... రాముల్ని మనస్సాక్షి ముందుకి నెట్టి, జేబులో ఉన్న నూట పదిరూపాయలు బయటకు తీసేలా చేసింది.

''సార్! నిన్న మీరెళ్ళిపోయాక, రేట్ల జాబితా కోసం వెతికాను. ఎప్పుడో పైన పడేసిన పాత కాగితాలు తిరగదీయగా, తీయగా దొరికింది. అందులో ఈ బెల్లు ధర పదిహేను రూపాయలే అనుంది. అట్ట పెట్టె మీద రేటు మాసిపోయి కన్పించకపోవటంతో నూట ఇరవై ఐదనుకున్నాను. తప్పయింది సార్! నిన్న మీరెళ్ళినప్పట్నుంచీ, ఈ రేటు చూశాక, ఎప్పుడు, ఎక్కడ మిమ్మల్ని కలవాలో, మీకీ డబ్బు ఎలా తిరిగి ఇవ్వాలోనని ఆలోచిస్తా ఉన్నాను. ఇప్పుడు మీరే వచ్చారు. తీసుకోండి సార్!'' అని నూట పది రూపాయలు ఇవ్వబోతుంటే... అతను రాములు వైపు ఆశ్చర్యంగా చూస్తూ...

''ప్రతి చిన్న విషయంలోనూ, ఎదుటివాణ్ణి మోసం చేసి, ఎలాగైనా డబ్బు సంపాదించాలనుకునే మనుషులే ఎక్కువగా కన్పిస్తున్న ఈ రోజుల్లో... మీలాంటి వ్యక్తుల్ని చూడటం చాలా అరుదు. రియల్లీ గ్రేట్. చిన్న తప్పిదం వలన ఎక్కువ తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వాలని మీలాంటి మంచి వాళ్ళని, నాలా స్థోమతున్న వాళ్ళు ఖచ్చితంగా ఎంకరేజ్ చెయ్యాలి. ఆ డబ్బు జేబులో పెట్టుకుని, మీ నిజాయితీకి నేనిస్తున్న ఈ ఇనాము తీసుకోండి అని బలవంతంగా రాములుచేతిలో మరో వంద రూపాయల నోటుంచి, అతను తృప్తిగా కారెక్కుతుంటే... అవాక్కయి స్థాణువులా నిలబడి అతన్నే చూస్తున్న రాములుతో...

''ఇదిగో రాములూ! ఇదిగో నా కొడుకు సైకిల్ ఓవరాయిలింగ్ చేసిన తాలూకు డబ్బు'' అని నిష్ఠూరపు మొహంతో డాబా రంగయ్య యాభై రూపాయలు చేతిలో పెడ్తుంటే..

''యాభై కాదు డెబ్భై ఐదు'' అన్నాడు రాములు.

''ఇదెన్నాళ్ళనుంచయ్యో! సెప్పా పెట్టకుండా నువ్విట్టా రేట్లు పెంచేస్తా ఉంటే, మా కెట్టా తెలుసుద్దీ, ఇంకోసారి చూద్దాంలే'' అంటూ నిలబడకుండా వెళ్ళిపోతున్న రంగయ్యని మనసులోనే తిట్టుకుంటూ...

చేతిలో ఉన్న డబ్బుకి జేబులో ఉన్న డబ్బు తీసి, కలిపి లెక్కబెట్టాడు రాములు. మూడొందల ఇరవైయున్నాయి.

కొడుకు ఎక్స్‌కర్షన్‌కి కట్టాల్సిన మూడొందలు మడిచి జేబులో పెట్టి, మిగిలిన ఇరవైలో బీడీ కట్ట కొనుక్కొచ్చి, ఒకటి వెలిగించి, రెండు దమ్ములు పీల్చి, పనిలో నిమగ్నమయ్యాడు. తన నిజాయితీకి అంటుకున్న మసి కడిగేసుకున్న తృప్తితో.

★